keratam.in www.digital.keratam.in

కెరటం

మంగళవారం, 06 జూన్ 2023 పేజీలు 08

## హైమావతి మృతికి ఎంపీ నామ నివాళి

### కుటుంబ సభ్యులకు సానుభూతి

శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)

కొత్తగూడెం మున్సిపాల్టీ పరిధిలోని రామవరం ఆరో వార్డుకి చెందిన టీబీజీకేఎస్ 11మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ తల్లి, కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా మహాలక్ష్మి అత్త హైమావతి(85) అకాల మృతికి



బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఉమ్మడి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో శ్రద్ధాంజలి ఘటించి, నివాలర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు నామ భరోసా కల్పించారు.

# సంబురంగా విద్యుత్ విజయోత్సవం

- గతంలో కరెంటు కోతలతో అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు
- నేడు రాష్ట్రంలోని ప్రతి రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- 24 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరావు
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ విద్యుత్ విజయోత్సవం
- పాల్గొన్న తాతా మధుసూదన్, జిల్లా కలెక్టర్ అనుదీప్, విద్యుత్ శాఖ ఎస్ఈ



శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)

దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా అన్ని రంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్న ఏకైక రాష్ట్రం మన రాష్ట్రమేనని కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం చుంచుపల్లి మండలం, ఎన్కే నగర్‌లోని ఖమ్మవారి కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ విజయోత్సవంలో శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్, జిల్లా కలెక్టర్ అనుదీప్, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ కల్సి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం తెలగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తరువాత విద్యుత్శాఖలో సాధించిన ప్రగతిపై సియం సందేశాన్ని వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కరెంటు కోతలతో అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడే వారని, తెలంగాణ వచ్చిన తరువాత అనతి కాలంలో విద్యుత్ సమస్యను అధిగమించి నేడు అన్ని రంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్న రాష్ట్రంగా విరాజిల్లుతున్నామని చెప్పారు. 45 సంవత్సరాల క్రింత తన ఇంటికి కరెంట్ లేదని గుర్తు చేస్తూ నేడు రాష్ట్రంలోని ప్రతి రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. కరెంట్ అన్ని వేళలా నిరంతరాయ విద్యుత్ అందచేస్తున్నామని చెప్పారు.

పోతే ఎపుడు వస్తుందో తెలీని స్థితి నుండి నేడు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తూ నేడు తెలంగాణ భారతదేశంలో నెంబర్వన్ రాష్ట్రంగా ఉందని శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి 9 సంవత్సరాలు పూరై 10వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంగా రాష్ట్ర ఏర్పాటు జరిగిన తదుపరి విద్యుత్శాఖ ప్రగతిపై నేడు తెలంగాణ విద్యుత్ శాఖ విజయోత్సవ సభ నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఒకపుడు అందని ద్రాక్షలా విద్యుత్ ఉండేదని, నేడు ఆ స్థాయి నుండి 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేసేస్థాయికి చేరామని 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలు ఫలితంగా సాధించుకున్న రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేని రాష్ట్రంగా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకున్నామని చెప్పారు. గతంలో ట్రాన్స్ఫార్మర్ ఆ గ్రామానికి వస్తే పండుగలా ఉండేదని నేడు అడిగిన వారందరికీ ట్రాన్స్ఫార్మర్లు ఇస్తూ లో ఓల్టేజి సమస్యను పరిష్కరించుకున్నామని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు జరిగిన తదుపరి 4 లక్షల 67 వేలు ఉన్న విద్యుత్ కనెక్షన్లు నేడు 8 లక్షల 56 వేలకు చేరుకున్నట్లు చెప్పారు. అపుడు 33/ 11 కెవి ఉప విద్యుత్ కేంద్రాలు 2138 మాత్రమే ఉండేవని, నేడు 3200 ఉన్నట్లు చెప్పారు. గతంలో ఇన్వర్టర్లు చార్జ్ చేసుకోవడానికి విద్యుత్ ఉండేది కాదని, నేడు అన్ని రంగాలకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ను ఇస్తున్న దార్శినికుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అని చెప్పారు. 97321 వేల కోట్లు విద్యుత్ రంగానికి కేటాయించామని, అందులో 50 వేల కోట్లు వివిధ రంగాల వారికి సబ్సిడి అందించినట్లు చెప్పారు. 101 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించుకున్న ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ను ఇస్తున్నామని చెప్పారు. ఆనాడు 7,8 ఖండేలు బావి తవ్వినా నీళ్లు పడేవి కావని, నేడు 4, 5 ఖండేలకే నీళ్లు పడుతున్నాయని చెప్పారు. ఆనాడు లో ఓల్టేజి సమస్యతో ఫీజలు పోయేవని, నేడు అటువంటి పరిస్థితులు లేవని చెప్పారు. చిన్నతనంలో తన తండ్రితో చేలకు వెళ్లేవాడినని, ఆనాడు ఉన్న విద్యుత్ సరఫరా పరిస్థితులను వివరించారు. నేటి పరిస్థితుల ఏ సమయంలోనైనా మోటార్లు వేసే పరిస్థితులు వచ్చాయని ఇదంతా ముఖ్యమంత్రి వల్లే అభివృద్ధి జరిగిందని, నేడు అన్ని వర్గాల ప్రజల మోముల్లో వెలుగులు చూస్తున్నామని చెప్పారు. గత సంవత్సరం గోదావరి వరదల సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఎనలేని సేవలు అందించారని మీ సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగుల కృషితో ప్రగతి సాధించామని అభినందించారు. రాష్ట్ర ఏర్పాటు తదుపరి విద్యుత్ రంగంలో మనం చేసిన ప్రగతికి గణాంకాలు ప్రతీకగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. జిల్లాలో 2014 సంవత్సరానికి ముందు జిల్లాలో 39 సబ్ స్టేషన్లుండగా, రాష్ట్ర ఏర్పాటు తదుపరి 73 పెరిగినట్లు చెప్పారు. వీటి విలువ మొత్తం 836 కోట్లు అని చెప్పారు. జిల్లాలో నూతనంగా వెంకటాపురం మండలం పినపాకలోను, ముల్కలపల్లి మండలంలోని మంగలిగుట్ట వద్ద, ఇల్లందు మండలంలోని పోలారంలలో 33/11 కెవి ఉప కేంద్రాలు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో సబ్ స్టేషన్లు నిర్మాణానికి ప్రతిపాదనలు అందచేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పవర్ ట్రాన్స్ఫార్మర్లు 63 ఉండగా, 54 ఏర్పాటు చేసుకున్నామని ప్రస్తుతం 117 ఉన్నాయని చెప్పారు. వీటి విలువ 21.15 కోట్లు వరకు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 9382 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లుండగా ప్రసుత్తం 18085 ఉన్నాయని చెప్పారు. వీటి విలువ 169 కోట్లు వరకు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 319060 ఉండగా రాష్ట్ర ఏర్పాటు తదుపరి నూతనంగా 107881 కనెక్షన్లు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 28536 ఉన్న వ్యవసాయ కనెక్షన్లును 103 కోట్ల వ్యయంతో 20569 నూతన కనెక్షన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పల్లె, పట్టణ ప్రగతిలో వంగిన, విరిగిన, లూజు విద్యుత్ వైర్లను సామూహికంగా ప్రక్షాళన చేసినట్లు చెప్పారు. గత సంవత్సరం గోదావరి వరదలకు గోదావరి పరివాహక మండలాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడిన దాదాపు 200 గ్రామాలకు 48 గంటల్లో సేవలు పునరుద్ధరించారని విద్యుత్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, జడ్పి వైస్ ఛైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు, జడ్పి సిఈఓ విద్యాలత, సర్పంచ్ సుగుణ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి యంపిపిలు బదావత్ శాంతి, భూక్యా సోను, మున్సిపల్ వైస్ ఛైర్మన్ దామోదర్, డిఈలు వెంకటరత్నం, శేషాద్రి, ఏడిఈలు హేమచంద్ర, ప్రభాకర్, యాసిన్, లక్ష్మణ్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.






# సత్తుపల్లిలో ఆర్ఎస్పీ విస్తృత పర్యటన

- కాకర్లపల్లిలో కూల్చిన ఇళ్ల స్థలాన్ని పరిశీలన
- టీఎస్పీఎస్సీని రద్దు చేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలి
- శాంతియుత నిరసన చేస్తున్న బీఎస్పీ నాయకుల అరెస్టు సరికాదు
- ఉద్యోగ ప్రకటనల పేరుతో నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన కేసీఆర్
- ఈ నెల 11న నిర్వహించే గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలి
- బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్



**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గద్దెనెక్కిన కేసీఆర్ ఉద్యోగాల పేరుతో నోటిఫికేషన్లు ఇచ్చి,పేపర్ లీకేజీలకు పాల్పడ్డారని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్పీఎస్సీని రద్దు చేసిన తర్వాతే గ్రూప్-1తో పాటు ఇతర పరీక్షలు నిర్వహించాలని, టీఎస్పీఎస్సీ ముందు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉద్యోగ ప్రకటనల పేరుతో 35 లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టిన కేసీఆర్, కోట్ల రూపాయలకు పేపర్లను అమ్ముకున్నారని ఆరోపించారు. టీఎస్పీఎస్సీని పేపర్ లీకేజీకి కారణమైన చైర్మెన్, సభ్యులను తొలగించి,కొత్త సర్వీస్ కమిషన్ను ఏర్పాటు చేసిన తర్వాతనే పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీని రద్దు చేయాలని గత మూడు నెలలుగా బీఎస్పీ డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. జూన్ 11న నిర్వహించే గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. టీఎస్పీ ఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన 16 పరీక్షల పేపర్లు లీక్ అయినట్లు సిట్, ఈడీ విచారణలో వెలుగు చూసినా కేసీఆర్ ప్రభుత్వం మాత్రం కమీషన్ చైర్మన్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ అంశాన్ని సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి నిందితులపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. భవిష్యత్తులో జరగబోయే పరీక్షలు పారదర్శకంగా జరగాలంటే, తక్షణమే కమీషన్ను రద్దు చేయాలన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకూ బీఎస్పీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

**పేదల ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి**

కేసీఆర్ ప్రభుత్వం రియల్టర్లతో కుమ్మక్కై పేదల ఇండ్లను కూల్చేయడం దుర్మార్గమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఖమ్మం జిల్లా సత్తపల్లిలోని కాకర్లపల్లిలో కూల్చిన ఇళ్ల స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. కాకర్లపల్లిల్లోని సర్వే నెం.334లో ఉన్న ప్రభుత్వ భూమిలో గత 30 ఏళ్ళ క్రితమే 280 కుటుంబాలు ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్నారని తెలిపారు.పేదలు ఇల్లు కట్టుకుంటే కూల్చివేయడం దారుణమన్నారు. పేద ప్రజలకు అండగా ఉండవలసిన ప్రభుత్వం ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న రియల్టర్లకు ఒత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు.పోలీసుల నిఘా నీడలో ఉద్రిక్తతల నడుమ పేదల ఇళ్లను కూల్చివేసి, ఇంట్లో ఉన్న సామన్లు, ఇతరత్రా సామగ్రిని బయటపడేయడం దారుణమన్నారు. అడ్డుకున్న నివాసితులను అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం అన్యాయమన్నారు.

పేదలు ఇండ్లు నిర్మించుకున్న స్థలం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసే వాళ్ళను వదిలేసి పేదలపై అధికారులు జులుం చేయడం ఏంటని ప్రశ్నించారు. రెవిన్యూ అధికారుల చర్యలతో 280 కుటుంబాలు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు, ఇళ్ళు లేని వారికి ఇళ్ళు కట్టిస్తామని కేసీఆర్ ఓ వైపు ప్రకటిస్తుండగా, అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు హేయమని అన్నారు. హైదరాబాదులో 125 అడుగులు అంబేద్కర్ విగ్రహం పెట్టి కేవలం దళితుల ఓట్లను కొల్లగొట్టేందుకు కేసిఆర్ కుట్రపడ్డాడని విమర్శించారు. స్థానిక దళిత ఎమ్మెల్యే దళితుల ఇండ్లు కూల్చివేస్తే, పేదల పక్షాన మాట్లాడకపోవడం విచారణకర మన్నారు. వాయు పుత్ర వెంచర్ పేరుతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఆక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.










## మొక్కల రాజశేఖర్‌ను అభినందించిన డిఎఫ్‌వో

**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికులు కొత్తగూడెం పురపాలక శానిటరీ ఇన్స్పెక్టర్ మూడ్ అశోక్ చౌహాన్ పుత్రిక రోహిత గాంధీ పుట్టిన రోజు పురస్కరించుకొని జిల్లా అటవీ శాఖ కార్యాలయం వన విహార్‌లో భద్రాద్రి జిల్లా డీఎఫ్‌వో లక్ష్మణ్ రంజిత్ నాయక్ సమక్షంలో ఒక మొక్కను నాటి, కేక్ కత్తిరించి, స్వీట్స్ పంచుకొని, డీఎఫ్‌వో రోహిత గాంధీకి ఆశీస్సులు తెలిపారు. ఘనంగా పుట్టిన రోజు వేడుక జరిగింది. ఈ సందర్భంగా డీఎఫ్‌వో లక్ష్మణ్ రంజిత్ నాయక్ ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు సింగరేణి ఉద్యోగి కొట్టురి నూర్వి రాజశేఖర్ 1070 రోజులుగా ప్రతీ రోజూ మొక్కలను నాటుతున్న సందర్భంగా వీరిని శాలువాతో సన్మానించి అభినందించారు. గ్లోబ్, గడ్డపార, పలుగు, మొక్కలతో వున్న వీరి గ్రీన్ మోటార్ వెహికల్ పేరుతో గడచిన ఏడు సంవత్సరాల కాలంలో కొన్ని వేల మొక్కలు నాటుతూ చేస్తున్న మొక్కల రాజశేఖర్‌గా పిలవబడుతున్న వీరి సేవలను గుర్తించి ప్రశంసించారు. ఈ సందర్భంగ డీఎఫ్‌వో లక్ష్మణ్ రంజిత్ నాయక్ మట్లాడుతూ మొక్కలూ మానవ మనుగడకు జీవన ఆధారం అని, ప్రతీ ఒక్కరూ తప్పకుండా మొక్కలూ



నాటాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి హరిత దీక్ష ముఖ్య సలహా దారు ఉపాధ్యాయుడు షేక్ దస్తగిరి, బీఆర్ఎస్ యువ నేత మూడ్ జయరామ్ నాయక్, అశోక్ చౌహాన్, వారి కుటుంబ సభ్యులు పాల్గొని డీఎఫ్‌వో లక్ష్మణ్ రంజిత్ నాయక్‌ని ఘనంగా సన్మానించారు.



# పెద్దమ్మ భరోసా..

# పెదనాన్న అభయం..

- మేమున్నానని.. మీకేం కాదంటూ.. చేయూత
- బిఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కర్నే మురళి కుమార్తెకు అండ
- స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించిన ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- అత్యవసర వైద్యానికి హైదరాబాద్‌లో నిపుణులైన పిల్లలు డాక్టర్‌ని సైతం సిద్ధం





**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కర్నే మురళి కుమార్తె లేఖన నక్షత్ర గత వారం రోజులు నుండి టైఫాయిడ్ డెంగ్యూ జ్వరంతో ఆరాధ్య పిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఇబ్బంది పడుతోంది.

ఈ విషయం తెలుసుకున్న స్వయానా ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ఫోన్ చేసి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ ముందస్తు జాగ్రత్తగా అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్‌లో నిపుణులైన పిల్లలు డాక్టర్‌ని సైతం సిద్ధం చేశారు. 14 ఏళ్లుగా అన్నీ తానై ఏ కష్టం రాకుండా కర్నే మురళిని తమ్ముడి కంటే ఎక్కువగా చూసుకుంటున్నాడు. కొత్తగూడెం రైటర్ బస్తీలో నివాసం ఉంటున్న ఇంటికి ఆదివారం రాత్రి చేరుకోని కర్నే మురళి కుమార్తెను కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అదేసమయంలో ఫోన్ చేసి పరామర్శించిన ఎమ్మెల్యే సతీమణి రేగా సుధా రాణి... పెద్దమ్మతో మాట్లాడు అని లేఖన నక్షత్రతో రేగా కాంతారావు ఫోన్లో మాట్లాడించారు.






## నేనున్నానని.. మీకేం కాదని..

### పలువురి మృతుల కుటుంబాలకు నాగా సీతారాములు భరోసా

**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

అశ్వరావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం టేకులబంజర గ్రామంలో "పళ్లె.వెంకన్న" దశదిన కార్యక్రమానికి హాజరై పూలువేసి నివాళు లర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. టేకులబంజర నందు గుగులోతు వసరామ్ కుమారుడు మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించిన టిపిసిసి సభ్యులు నాగా. సీతారాములు, సున్నం, నాగమణి.జిల్లా కాంగ్రెస్ నాయకులు షాబీర్.హుస్సేన్, పసుపులేటి.వీరబాబు, అజ్మీర.శ్రీనివాస్, నలగోపు.వెంకటేశ్వర్లు, చంద్రుగొండ మండలం మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, గ్రామస్తులు పాల్గొన్నారు.





**విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం రూ.20,841కోట్ల బకాయిలు**

## నిజం కాదా..?

- విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించకుండా విద్యుత్ వేడుకలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.సోమవారం సర్వారం గ్రామంలోని ఒడ్డుగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లేకపోవడంతో జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో చిన్నపాటి వర్షం,గాలులకే తీవ్రంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అన్నారు.వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు పాల్వంచ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసి సంవత్సరం దాటినా,ఇప్పటికీ ఆ ఊసే లేదని,డివిజన్ కార్యాలయం ఎందుకు ఏర్పాటు చేయలేదని,ఇది పాలకుల అసమర్ధ పాలనకు నిదర్శనమన్నారు.ఎమ్మెల్యే సొంత ఊరులోనే డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని విమర్శించారు.ప్రభుత్వం పల్లె ప్రగతి,పట్టణ ప్రగతి అని నిర్వహించి గ్రామాల్లో త్రీ ఫేస్ కరెంట్ ఇస్తామని గొప్పలు చెప్పినా,చాలా గ్రామాల్లో ఇప్పటికీ సింగిల్ ఫేస్ లోనే విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు.సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నారు కానీ సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడంతో,విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం విద్యుత్ డిస్కమ్ లకు సుమారు 20,841 కోట్ల బకాయిలు ఉండటం మూలంగా విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి వెళ్ళి భవిష్యత్తు లో విద్యుత్ సంస్థలు నిర్వీర్యమయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు 24 గంటల ఉచితంగా కరెంట్ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ 12గంటలు కూడా సరఫరా చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, పాయం శారద, భూక్య కొటేష్, భూక్య దేవరాజ్, బాణోత్ సాయికిరణ్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# సిరుల తల్లి సింగరేణి మురిసేలా..

# దశాబ్ది వేడుకలు

**ధూం ధాం బృంద డప్పులతో.. ఆదివాసీ గిరిజనుల ఆటపాటలతో మారుమోగిన గూడెం**

## హెడ్ ఆఫీస్ నుండి కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు 'తెలంగాణ రన్'



- జాతీయ పతాకాన్ని ఎగురవేసిన డైరెక్టర్ (పిపి) జి.వేంకటేశ్వర రెడ్డి
- తెలంగాణ వచ్చాక సింగరేణిలో అభివృద్ధి
- ఉన్నతాధికారి నుంచి ప్రతి ఒక్క కార్మికుడి కష్టం సింగరేణి అభివృద్ధిలో ఉంది
- సభలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్



**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

డైరెక్టర్ (పిపి) జి వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని హెడ్ ఆఫీస్ నుండి కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు 'తెలంగాణ రన్' నిర్వహించారు. అందులో ధూం ధాం బృంద డప్పులతో, ఆదివాసీ గిరిజనుల ఆటపాటలతో, సింగరేణి అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు, సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మెయిన్ హాస్పిటల్, ప్రాజెక్టు ప్లానింగ్, ఎస్టేట్స్, ఎన్విరాన్మెంట్, సెక్యూరిటీ, సివిల్, ఎకౌంట్స్ సింగరేణి కళాశాల విద్యార్థులు అన్ని హోదాల ఉద్యోగులు నృత్యాలు చేసుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ప్రకాశం స్టేడియం కార్యక్రమంలో డైరెక్టర్ (పిపి) జి వేంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తరువాత సింగరేణి పుస్తక ఆవిష్కరణ, సింగరేణిపై డాక్యుమెంటరీ వీడియో ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాత మధు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ఉద్యోగులు సాధించిన అద్భుత విజయాలన్నీ ఈ 'సింగరేణి ప్రగతి' సంచిక ద్వారా తెలియజేయబడ్డాయని అన్నారు. తెలంగాణ వచ్చాక సింగరేణిలో అభివృద్ధి జరిగిందనడానికి ఈ సంచిక ఒక నిదర్శనం అని అన్నారు. సింగరేణి లేకుండా తెలంగాణ లేదు తెలంగాణ లేకుండా సింగరేణి లేదు అని కీర్తించారు. సింగరేణి సంస్థ తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సంస్థ సి అండ్ ఎండి నుండి సింగరేణిలో పని చేసే ప్రతిఒక్క కార్మికుడి కష్టం సింగరేణి అభివృద్ధిలో ఉందని అన్నారు. సింగరేణి అనేది తెలంగాణ యొక్క గుండెకాయ లాంటిది, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది. తెలంగాణ లో 24గంటల నిరంతరాయ విద్యుత్తు ఇస్తున్నారంటే దాని వెనుక సింగరేణి ఉద్యోగుల రెక్కల కష్టం ఉన్నదని అన్నారు.

కొత్తగూడెం శాసనసభ్యులు వనమా వేంకటేశ్వర రావు మాట్లాడుతూ... 134 సంవత్సరాల సింగరేణి సంస్థ చాలా అభివృద్ధి పథంలో నడుస్తూ ఉంది. కొత్తగూడెంలో చాలా మైన్‌లలో మేము భాగస్వాములమై ఉన్నామని అన్నారు. సింగరేణి కార్మికుల కష్టం వర్ణనాతీతమని అన్నారు. సింగరేణి సంస్థని, కార్మికు లని కాపా డు కో వా ల్సిన బా ధ్య త మన అంద రిపై ఉన్న దని అన్నారు. ఇల్లు కోల్పోయిన ఎస్ఆర్‌టి, మాయాబజార్, వనమా నగర్ వాసులకు కచ్చితంగా న్యాయం చేస్తామని అన్నారు.



కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ... గత 9 సంవత్సరా లుగా సింగరేణి ప్రస్థానం మన దేశానికి ఆదర్శంగా నిలిచిందంటే సింగరేణి ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. సింగరేణి అభివృద్ధికి సంచిక 'సింగరేణి ప్రగతి' ఒక నిదర్శనం అని అన్నారు. సింగరేణి సంస్థ సహకారంతో మరియు సమన్వయంతో జిల్లా యంత్రాంగం చాలా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. సిఎస్ ఆర్, డిఎంఎఫ్ నిధులు అత్యధికంగా సింగరేణి నుండే వచ్చాయని తెలిపారు. మన జిల్లాకు లభించిన దాదాపు 1000 కోట్ల సిఎస్ఆర్, డిఎంఎఫ్ నిధులు సింగరేణివే అని తెలియజేశారు. సింగరేణి నిధులతో ఎన్నో రోడ్లు, బ్రిడ్జిలు, హాస్పిటల్ లలో మౌలిక వసతులు జిల్లా యంత్రాంగం కల్పించిందని తెలిపారు. సింగరేణి సంస్థని పటిష్టంగా నడిపించడమే కాకుండా వారి సామాజిక బాధ్యతగా జిల్లాలోని అనేక గ్రామాలకు సిఎస్ఆర్, డిఎంఎఫ్ నిధులు ఉపయోగపడుతున్నాయని అన్నారు. సింగరేణి వృద్ధి చెందుతూ ఉండాలంటే కొత్త గనులు రావాలని, దాని కోసం భూ సేకరణ జరపాలి, భూ సేకరణ కోసం జిల్లా యంత్రాంగ సహాయసహకారాలు ఎప్పటికీ ఉంటాయని హామీ ఇచ్చారు. గత సంవత్సరం భద్రాచలంలోని వరదల సమయంలో సంస్థ సి అండ్ ఎండి ఎన్. శ్రీధర్ ఐఏఎస్ స్వయంగా 7 రోజులు అక్కడే ఉండి, డైరెక్టర్‌లు, జిఎంలు, గనులలో వినియోగించే భారీ యంత్ర సామాగ్రితో భద్రాచలం ముంపు ప్రాంతాలలోని నీటిని 3 రోజులలోనే పంప్ చేశారని, జిల్లా యంత్రాంగానికి సింగరేణి సంస్థ ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని తెలియజేశారు. సింగరేణి అంచెలంచెలుగా ఎదుగుతూ దేశంలోనే నెం. 1 కోల్ టర్నోవర్ సంస్థగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, ఎల్లప్పుడూ తమ సహాయసహకారాలు ఉంటాయని తెలియజేశారు. తరువాత అన్ని ఏరియాల ఉత్తమ కార్మికులకు సన్మాన కార్యక్రమం, ఉత్తమ స్కాలర్ షిప్ లు పొందిన కార్మికుల పిల్లలకు చెక్కులను అందజేశారు. అలాగే ఉత్తమ సేవా కార్యక్రమాలకు సేవా బృందానికి బహుమతులను అందజే శారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జిఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా డైరెక్టర్ పి అండ్ పి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కలెక్టర్ డి.అనుదీప్, విశిష్ట అతిథులుగా ఎంఎల్‌సి తాతా మధు, ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు, టిబిజికేఎస్ కార్పొరేట్ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, ఏఐటియూసి నుండి శేషయ్య, ఐఎన్‌టియూసి నుండి జనక్ ప్రసాద్, సిఐటియూ నుండి మందా నర్సింహా రావు, హెచ్ఎంఎస్ నుండి గోద రమేష్, బిఎంఎస్ నుండి మాధవ్ నాయక్, సిఎంఓఏఐ కార్పొరేట్ ప్రతినిధి రాజీవ్ కుమార్, జిఎం సిపిపి కొండయ్య, జిఎం పిపి సుధాకర్, జిఎం ఫైనాన్స్ ఎం.సుబ్బారావు, జిఎం ట్రాన్స్ పోర్ట్ ఎన్.దామోదర్, జిఎం సెక్యూరిటీ బి.హనుమంతరావు, జిఎం సివిల్ టి.సూర్యనారాయణ, జిఎం ఈ అండ్ ఎం ఎల్‌వి గణపతి రావు, సిఎంఓ బి వెంకటేశ్వరరావు, డిజిఎం వెల్ఫేర్ కె.శ్రీనివాస రావు, కార్పొరేట్‌లోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఇతర యూనియన్ నాయకులు, సేవా సభ్యులు ఇతర అధికారులు, ఉద్యోగులు, సింగరేణి మహిళా కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# పకడ్బందీగా గ్రూప్ వన్

- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు
- ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలి
- జిల్లాలో పరీక్ష నిర్వహణకు 22 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షకు హాజరుకానున్న 8851 మంది అభ్యర్థులు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- తహసిల్దార్లు, పరీక్షా కేంద్రాల ఇన్చార్జులతో వీడియో కాన్ఫరెన్సు



**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న గ్రూప్ వన్ పరీక్ష ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీగా, ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం నుండి గ్రూప్ వన్ పరీక్ష నిర్వహణపై సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ తహసిల్దార్లు, పరీక్షా కేంద్రాల ఇన్చార్జులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష నిర్వహణకు 22 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వివరాలను ఆయన వెల్లడించారు. సుజాత నగర్ 1, కొత్తగూడెం 8, లక్ష్మీదేవిపల్లి 4, పాల్వంచ 9 కేంద్రాల్లో 8851 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షా సమయం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని చెప్పారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుండి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 10.15 తదుపరి ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని, టంచనుగా 10.15 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసి వేయాలని చెప్పారు. సమయాన్ని గమనించి పరీక్ష వ్రాసే అభ్యర్థులు సుదూర ప్రాంతం వాళ్లయినట్లయితే ఒక రోజు ముందుగానే ఆయా మండలాలకు చేరుకోవాలని చెప్పారు. రాష్ట్ర పరిధిలో అత్యంత ప్రాధాన్యత ఉన్న పరీక్ష గ్రూప్ వన్ అని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పకడ్బందిగా నిర్వహించాలని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పర్యవేక్షణ చేసి నివేదికలు అందచేయాలని తహసిల్దార్లను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో రూటు అధికారులు, ఛీఫ్ సూపరింటెండ్లు విధులు అత్యంత ముఖ్యమైనవని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అత్యవసర వైద్యకేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. రూటు అధికారులు, ఛీఫ్ సూపరింటెండ్లుకు మాత్రమే సెల్ ఫోన్ అనుమతి ఉంటుందని, ఇన్విజిలేటర్లుకు అభ్యర్థులకు అనుమతి లేదని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను మెటల్ డిటెక్టర్తో నిశిత పరీక్ష చేసేందుకు మహిళలకు, పురుషులకు విడివిడిగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి టివిలు ఏర్పాటు చేయాలని చెప్పారు. దివ్యాంగులకు మొదటి ఫ్లోర్లో సీటింగ్ ఏర్పాటు చేయాలని, స్క్రైబ్స్ జాబితా సిద్ధం చేయాలని, అదనంగా ఇద్దరిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. సీటింగ్ కెపాసిటి ప్రతి రూములో 24 లేదా 48 ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సీటింగ్ 24, 48 మాత్రమే ఉండాలని ఎక్కువ కానీ, తక్కువ కానీ మధ్యస్థ నెంబర్లు కూడా ఉండొద్దని చెప్పారు. ఇన్విజిలేటర్లును లాటరి పద్ధతి ద్వారా కేటాయించడం జరుగుతుందని చెప్పారు. పరీక్ష నిర్వహణపై మండలస్థాయిలో సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. పరీక్ష పత్రం పరీక్షా కేంద్రాలకు తరలింపు, పరీక్ష తదుపరి తీసుకొచ్చే సమయంలో అత్యంత బద్రత నడుమ ఎస్కార్ట్ ఉండాలని పోలీసులకు సూచిం చారు. స్ట్రాంగ్ రూము తనిఖీ చేసి నివేదిక అందచే యాలని డిఆర్డీఓకు సూచించారు. ఏర్పాట్లు బాద్యత లైజనింగ్ అధికారులపై నున్నదని ఎలాంటి లోటు పాట్లు రాకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. గతంలో మన జిల్లాలో పకడ్బందిగా పరీక్ష నిర్వహించామని, ఈ సారి కూడా అదే తరహాలో ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా ప్రశాం తంగా నిర్వహించుటకు చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డి ఓ వేణు, మిషన్ బగీరథ ఈ ఈ తిరుమలేష్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, విద్యుత్ శాఖ డిఈ వెంకట రత్నం, ఎస్పి సిఐ సర్వయ్య, కలెక్టరేట్ ఏఓ గన్యా, అన్ని మండలాల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 2వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరుగుతున్న మహెూత్సవాల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవాన్ని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. సోమవారం తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం నిర్వహణపై ఒక ప్రకటన జారీ చేశారు. ఈ వేడుకలు నిర్వహణకు సమన్వయం చేసే భాధ్యతను జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారాంను నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని పారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో సభలు నిర్వహించాలని చెప్పారు. ఈ సభలో పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించాలని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావానికి 2014 సంవత్సరానికి ముందు 2014 తరువాత పరిశ్రమలు ఏర్పాటుకు అనుమతులు జారీ, ప్రక్రియ సులభతరం చేసిన విధానం, పరిశ్రమలు స్థాపనకు టీఎస్ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపన సత్వర అనుమతులు, సులభతరమైన విషయాన్ని తెలియచేయాలని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వెల్లువకు సంబంధించిన వివరాలు తద్వారా పెరిగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాల వివరాలను ప్రకటించాలని చెప్పారు. విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిపై కర పత్రాలు పంచాలని చెప్పారు. టి హబ్, వి హబ్ లలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహించాలని చెప్పారు.ఐటీ ఎగుమతులు, ఉద్యోగ కల్పనలో హైదరాబాద్, బెంగళూరును అదిగమించి దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిన తీరును ఆవిష్కరించాలని చెప్పారు.



# సంబురంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- సింగరేణి మహిళా కళాశాల నుండి ఐ.ఎం.ఏ హాల్ వరకు గ్రీన్ ర్యాలీ
- జెండా ఊపి ప్రారంభించిన పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్
- "ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు" అనే అంశంపై అవగాహన సదస్సు




**శామ్, జూన్05(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న గ్రీన్ ర్యాలీని, సింగరేణి మహిళా కళాశాల నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా ఐ.ఎం.ఏ హాల్ దాకా నిర్వహించినారు. ఈ ర్యాలీని బి.రవీందర్, పర్యావరణ ఇంజనీర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో సింగరేణి ఎన్విరాన్మెంట్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర పరిశ్రమల అధికారులు, వారి ప్రతినిధులు, సింగరేణి మహిళా కళాశాల లెక్చరర్స్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 సందర్భంగా ప్రత్యేక ఉద్దేశ్యమైన "ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు" అనే అంశంపై అవగాహన సదస్సును డిఐసి జీఎం టి.సీతారాం ముఖ్య అతిథిగా ఐ. ఎం.ఏ. హాల్ నందు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముందుగా పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్య నియంత్రణ చట్టాలు జిల్లాలో వాటి అమలును, పరిశ్రమలు మరియు ప్రజలు వారి దైనందిత జీవితములో తీసుకోవలసిన పర్యావరణ హితమైన చర్యలు గురించి వివరించినారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి వాటి బదులుగా నారా లేదా గుడ్డ సంచులను వాడాలని కోరారు. సింగరేణి ఎన్విరాన్మెంట్ అడిషనల్ మేనేజర్ రవి కిరణ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో చేపట్టిన పర్యావరణ హితమైన చర్యలు గురించి మాట్లాడుతూ, ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. బి. వెంకటేశ్వరరావు సైంటిఫిక్ ఆఫీసర్, ఎన్విరాన్మెంట్, సింగరేణి వారు ఈ సంవత్సరం ముఖ్య ఉద్దేశం అయిన "ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు" అనే అంశంపై తీసుకోవలసిన చర్యల గురించి ప్రజలకు వివరంగా తెలిపినారు.శ్రీ దాసు, క్వాలిటీ అస్స్యూరెన్సు మేనేజర్, సర్వరాయ సుగర్స్ కంపెనీ, సత్తుపల్లి వారు మాట్లాడుతూ వారి పరిశ్రమలో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ నియంత్రణ మరియు ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానాల గురించి వివరించారు. జీ.వీ.ఎల్. గణపతి, జి.ఎం., ఎన్విరాన్మెంట్, సింగరేణి వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పర్యావరణ సంరక్షణకు ప్రాముఖ్యత ఇస్తున్నామని తెలుపుతూ దానికి ఉదాహరణగా సింగరేణి సంస్థలో అమలుపరిచిన పర్యావరణహితమైన చర్యలను గురించి వివరించారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ, భావితరాలకు ప్లాస్టిక్ కాలుష్యం వల్ల వచ్చే ముప్పులను వివరించుతూ ఆదర్శంగా నిలవాలని కోరారు. చివరిగా డిఐసి జీఎం టి.సీతారాం మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు అవసంమని తెలుపుతూ, పరిశ్రమల నిర్వహణ పర్యావరణ చట్టాలకు లోబడి ఉండాలని తెలిపినారు. ఈ సదస్సుకు విచ్చేసిన స్కూలు మరియు కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు పర్యావరణ హితమైన చర్యలను అవలంబించవలసిందిగా మరియు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించవలసిందిగా కోరారు. ఈ కార్యక్ర మానికి విచ్చేసిన ముఖ్య అతిథి డిఐసి జీఎం టి.సీతారాంచే జ్యూట్ బ్యాగులను విడుదల చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థు లకు, ఉపాధ్యాయులకు మరియు వివిధ పరిశ్రమల ప్రతినిధులకు జ్యూట్ బ్యాగులను, కాప్స్ పంపిణీ చేయడం జరిగింది. కాలుష్యం నియంత్రణ మండలి ప్రాంతీ య కార్యాలయం కొత్తగూడెం వారి తరపున బి.రవీందర్, పర్యావరణ ఇంజనీర్, ఎన్.వెంకటేష్, సహాయ పర్యావరణ ఇంజనీర్, జి.లింగయ్య, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త, కార్యాలయ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.